523) దేసాళం/బిలహరి

ప|| కడనుండి చూచేనీకు గనికరమైతేగన- | బడి నన్ను గావు నీతో బలిమేలే ||

చ|| వొడలుమోచినయది యొకయపరాధము | అడరి సంసారినౌటె యపరాధము |
బడి నివి పఱచినపాట్ల బడకపోదు | యెడనీకు మొరబెట్ట నిక జోటేదయ్యా ||

చ|| అన్నపానములు గొన్న దది యొక్కనేరమి | వున్నతి సంపద బొందు టొకనేరమి |
యిన్నియు ననుభవించి యిక నొల్లనంటే బోదు | విన్నపాలు సేసి నీతో విసుగ జోటేది ||

చ|| మదిలో నీవుండగాను మఱచిన దొకకల్ల | అదన గర్మాధికారినౌటొకకల్ల |
యెదుట శ్రీవేంకటేశ యిట్టె నన్ను గాచితివి | తుద కెక్కితిమి యింక దొలగగవలెనా ||